ఆయన బ్రతికున్న రెండుసంవత్సరాల్లోనూ ఆయన పలుకుబడినికూడా తనడిగ్రీకి జతపర్చి, ఊరూ, వాడా గాలించినా ఉద్యోగం లభించలా- ఇంక లభిస్తుందన్న ఆశా,అంతరించింది-ప్చ్-ఏమిటో వెధవబ్రతు కనుకుంటూ ఏదో ఆలోచించుకుంటూ బృంద సభ్యులలో కొందరాడుతున్న అడ్డాటను యథాలాపంగా పరికిస్తూ కూర్చున్న రామాన్ని గదిలోనుండే వేరొకమూలనుండి వెలువడ్డ మాటలు మేల్కొలిపినై. ఒక కంఠం అంటోంది.

ఫగర్ ఈ విధంగా ఉన్నప్పుడు ఎప్పుడూ 'ఫోర్'యాక్షన్ చేసింది చార్టు, థియరీ ప్రకార చూసుకున్నా ఫోరు త్రీ-ఏ వస్తుంది ఫోర్ త్రీ-గన్‌షాట్ రాకపోతే ఇక ఈ చార్టే ముట్టను" అని రెండోకంఠంత కొల్పు ఖండించి పారేసింది.

"ఏడ్చావులేరా... వెధవ 'తీరీ'లు నువ్వూను-చూడు కావాలంటే నేనోక థియరీ చూపిస్తా... ఫోర్ - ఓపెనింగ్ కరెక్టేకాని-క్లోజింగ్ మాత్రం ఫైవ్ బీరుపోదు....ఫోర్ - ఫైవ్ - గుద్దితే అంతా డబ్బే" అని.

సంభాషణనంతా విన్న రామం తలపంకించి లేచాడు.

ఓ నెలగడిచింతరువాత భార్యని పిల్లాడిని, మళ్ళీ తీసుకొచ్చాడు.

రామం బి. ఎ. బ్రాకెట్టు బుక్కర్.

రూపాయకు అణన్నర కమీషన్—

రూపాయివేసి అరవయినాలుగు రూపాయలు సంపాదించాలనే ఆకాంక్షవున్న ప్రజలవల్ల- కమీషమీషన్ పేరుతో రోజుకో మూడురూపాయలు గిట్టుబాటవుతున్నాయి. రక్షణశాఖ ఫలహారానికి గాను ఓ అర్థరూపాయి పోయినా నిఖరు సంపాదన నెలకి 75 రూ. రామం సంసారం సక్రమంగానే దొర్లిపోతూందిప్పుడు.

---

కథానిక

# కళా - శశికళా

కె. హనుమంతరావు

"లక్ష్మీప్రసాద్ అండ్ కోలో కదూ 'క్షణక్షణముల్ ...' ఉందన్నావూ?"

"ఏం, బజారుకు పోతున్నారా?"

"అవును."

"ఇప్పుడా పుస్తకం కొనుక్కురావల్సిన అవసరం లేదు."

"మరి పొద్దున కావాలన్నావు?"

"కాని ఇది సాయంకాలం...'సినిమాస్కోప్'కు పోదామని..."

"నాకు వీలుకాదు. నీవు పోయిరా. నేను బజారుకెళ్ళి రంగులు కొనుక్కు తెచ్చుకోవాలి."

... ... ... ... ...

రాజా వెళ్ళిపోయాడు. శశికళ రాజా పోయిన దారివంకే చూస్తూ వాకిట్లో నిల్చుండిపోయింది. ఆవేగంతో కిందిపెదవి వణుకుతున్నది. నల్లని నయనాంచలాలలోంచి బుగ్గలమీదుగా వెచ్చని బాష్పాలు జారుతున్నయ్. లోపలినుంచి ఆక్రోశం వస్తున్నది, ఆపుకోలేకపోతున్నది.

తను కాపరానికి వచ్చి దాదాపు నాలుగు నెలలయింది. ఒక్క సినిమాకూడా చూడలేదు. పుట్టింటిదగ్గరయితే నెలకు కనీసం నాలుగు సినిమాలయినా చూసేది. కాని ఈనాడు సినిమాస్కోప్ చూడాలని మనసయింది. నోరుతెరుచుకొని అడిగింది. ఆయనంత నిర్లిప్తంగా జవాబిచ్చిపోయాడు.

తనేంచేస్తుంది? ఒక్కతేపోతే ఆనందమేముంటుంది? తనకీనాటికీ రాజాతో పరిచయమయిన రోజునూతలుచుకుంటే ఎంతో ఆనందంకలుగుతుంది.

నాన్నగారు తీసికొచ్చి పరిచయం చేశారు. గొప్ప చిత్రకారుడు అని చెప్పారు. చేతిలో ఫైల్ ఉంది. అందులో కొన్ని బొమ్మలుతీసి చూపించారు. ప్రతిగీతలోను కొత్తదనం ఉంది. నాన్న చెప్పినది నిజమేననిపించింది. కాని వాటిలో స్త్రీల చిత్రాలు లేవు. స్త్రీలతో స్నేహంలేదు కాబోలు అనుకుంది. ఆ కొరత తగు తీర్చగలనను కుంది; తీర్చింది.

కళకే తన జీవితాన్ని అంకితం చేయాలనుకుంది. అందుకా కళాస్రష్టను వివాహమాటడం ఒక మార్గ మనుకుంది. అమ్మచేత చెప్పించింది నాన్నగారికి. "సరే"నన్నారు. వివాహమయింది. ఇక తన జీవితం నిత్యమూ నలుదెసల తమ పరిమళాన్ని వెదజల్లే మకరందంతో కూడిన ప్రసూనాలు కలిగిన సుగంధ సుమవనమేననుకుంది.

తను ప్రక్కన కూర్చొని ఎన్నో బొమ్మలు రాజాచేత గీయించింది. అయినా తన మనస్సు అశాంతి, అసంతృప్తులతో బాధపడుతున్నది. ఎందుకో అర్థంకావటంలేదు.

"ఇక్కడ ఉండలేను" అనుకుంది పుట్టింటికి పోవాలనుకుంది. పెట్టె సర్దుకుంది. వీరాయితో చెప్పి జట్కా తెప్పించింది.

"ఆయన వస్తే పుట్టింటికి వెళ్ళానని చెప్పు"అని వీరాయితో చెప్పి స్టేషనుకు పోనీయమంది జట్కాను.

టిక్కెట్టు తెప్పించింది. రైలు వెంటనేవచ్చింది. ఆడవాళ్ళ పెట్టెలో ఎక్కి కూర్చున్నది పెట్టె లోపల పెట్టించి.

శశికళ కెదురుగా యిద్దరాడవారు — అప్పా చెల్లెలు కాబోలు, కబుర్లు చెప్పుకుంటున్నారు.

"అక్కయ్యా! బావకు బహుమానం వచ్చి నందుకు నా కంగ్రాచ్యులేషన్స్ చెప్పు!"

"అలాగే!"

బహుమానం! ఎందుకు అయి ఉంటుంది? ఎందులోనయితేనేం 'బహుమానం' కోసమే కదా తన రాజా అంత కష్టపడి బొమ్మలు గీస్తున్నది! తన బొమ్మేకదూ గీసి ఎగ్జిబిషన్‌కు పంపిస్తానన్నది! మరి తను ఎదురుగా లేకపోతే తన బొమ్మ నెలా గీస్తారు? బహుమాన మెలా వస్తుంది? తను కళా రాధన కోసం కదూ రాజాను వివాహం చేసుకో వటం?...

"శశికళ లేరాండీ!"

"లేదు."

"ఎక్కడికి పోయిందండీ?"

"పుట్టింటికి."

"మరి మీ రామె బొమ్మరాసి ఎగ్జిబిషన్‌కు పంపిస్తారని చెప్పింది. ఇప్పుడెట్లా?"

"అదే ఆలోచిస్తూ కూర్చున్నాను. నా శశి లేకపోతే నే గీయలేను."

"పోనీ నే కూర్చుంటాను...గీయరాదూ!"

"ఏమిటీ? మీరు మోడలుగా ఉంటారా?"

"ఏం తప్పా?"

"లేదు. కాని ఆ బొమ్మ ఎగ్జిబిషన్‌కు పంపితే ఎవరయినా చూస్తారు, ఏమయినా అనుకోగలరు."

"ఎవరేమి అనుకున్నా నాకు భయంలేదు. మీరు చిత్రం గీయటేమిటి? బహుమానం రాక పోవటమేటి? తప్పక వస్తుంది. పత్రికలలో ప్రచు రిస్తారు. చాలామంది ఆ చిత్రాన్ని జాగ్రత్తగా దాచిపెట్టుకుంటారు. అందుకు నేనూ, మీరూ గర్వపడవచ్చును."

శశికళ ఇక ఊహించకపోయింది. అవును. నిజంగానే రాధ వస్తుంది రాజాదగ్గరకు. అలాగే మాట్లాడుతుంది. రాజాచేత బొమ్మ గీయిస్తుంది. 'బహుమానం' పొందిన చిత్రానికి మోడలు రాధ అవుతుంది. అలా అవటానికి వీలులేదు. రాజా తన బొమ్మే గీయాలి. ఆ గౌరవం తనకేదక్కాలి.

అసలు తను రాజాని, రాజా బొమ్మలను వదిలి ఒక్కరోజు ఉండగలదా? తను ఆవేశంతో యిలా వచ్చిందిగాని...

"కలకత్తాపోయే జనతా ఎక్స్‌ప్రెస్ ప్లాట్ ఫారం ఒకటినుండి కొద్దిక్షణాలలో బయలుదేరును" అని ఎక్కడినుండో వినపడుతున్నది. మెర్క్యూరీ లైట్లకాంతిలో ప్లాటుఫారం తెల్లగా మెరుస్తోంది. ఇళ్ళకిపోయే విద్యార్థు ముఖాల్లో 'యింటికి పోతు న్నాంకదా' అని ఆనందం, 'స్నేహితుల్ని మళ్ళీ మూడునెలలుకాని కలుసుకోమని తలుచుకోనేసరికి కలిగే విచారం ద్యోతకమవుతున్నయ్.

గార్డు 'ప్రయాణీకులందరూ బండి ఎక్కారు. ఇకపోవచ్చును' అన్నట్లు విజిల్ ఊది పచ్చజెండా ఊపుతున్నాడు.

"నాదేమీ ఆలస్యంలేదు..బయల్దేరుతున్నాను" అన్నట్లు యింజను పెద్దగా కూతవేసింది. ఆ కూత వచ్చి శశికళ చెవిలో మార్మోగింది.

శశికళ గబుక్కున లేచింది బల్లమీదనుండి. పెట్టె మెల్లగా ప్లాట్‌ఫారమ్ మీదికి జారవిడిచింది.

రైలు మెల్లగా కదులుతున్నది. శశికళ ఫుట్ బోర్డుమీద అడుగు పెట్టబోతున్నది. ప్రయాణీ కులు "దిగకండి! దిగకండి! పడిపోగలరు!" అని హెచ్చరించారు. శశికళ అవేమీ వినిపించుకో

కుండా ప్లాట్‌ఫారమ్‌మీద కాలు పెట్టింది. ముందుకు పడబోయింది.

అక్కయ్యకు 'ఫేర్‌వెల్' యిస్తూ చేయి ఊపుతున్న 'చెల్లెలు' శశికళ పడిపోకుండా పట్టుకుంది. శశికళకు చచ్చేటంత సిగ్గేసింది. తలెత్తలేకపోయింది.

'ఎందుకు దిగారు' అని అడగబోయింది చెల్లెలు. అంతలోకే శశికళ 'కూలీ'ని పెట్టెతెమ్మనిచెప్పి గేటుదాకా పోయింది.

టికెట్ కలెక్టరుకు టికెట్‌యిచ్చి గేటుదాటిపోయింది. అతను టికెట్ చూసుకున్నాడు. ఆమె రిఫండ్ ఎందుకడగలేదా అని ఆశ్చర్యంగా టికెట్ కలెక్టరు నోరుతెరచి ఆమెపోయిన వేపే చూస్తూ ఉండిపోయాడు. మిగతా ప్రయాణీకుల కర్థంకాలేదు. ఆమె టికెట్ యిచ్చిపోతే యీాయనెందుకు నోరు తెరుస్తున్నాడో.

శశికళను స్టేషనుకు తీసుకొచ్చిన జట్కావాలాయే మళ్ళీ బండికట్టాడు. వాడేమీ అడగలేదు శశికళను. వాడలాంటివారిని చాలామందిని చూశాడు కాబోలు 'కూలీ'పెట్టెబండిలోపెట్టాడు.

శశికళ ఈతడవ ఎక్కడికి బండిని తోలాలో చెప్పకుండానే జట్కావాలా యింటికితోలాడు.

శశికళ తప్పుచేసినట్లుగా 'ఫీల్' అవుతున్నది. రాజా 'ఎక్కడికి పోయివచ్చావు' అని అడిగితే తనేం చెప్పాలి? నిజం చెప్పాలా? అబద్ధం చెప్పాలా? నిజంచెపితే ఏమనుకుంటారు ఆయన? తనవేవిధంగా అర్థం చేసుకుంటారు? ఆయనేవిధంగానయినా అర్థంచేసికోనీ క్షమాపణ చెప్పుకుంటుంది. అవును!- అబద్ధమాడి ఆత్మవంచన చేసికోవటంకన్న క్షమాపణ చెప్పుకోవటం నయం!

మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ యింట్లోకి నడిచింది. రాజా యింకారాలేదు. పెట్టెలోపలికి తెప్పించి గదిలో పెట్టించింది. బండివాడికి డబ్బులిస్తున్నది. అంతలోకి రాజా వచ్చాడు. వాడు డబ్బులు తీసికొనిపోయాడు.

"ఎక్కడికి పోయివచ్చావు?" అడగనే అడిగాడు రాజా.

"ఆఁ నేనా స్టేషనుకుపోయాను."

"ఇందాక 'సినిమాస్కోప్'కా'స్టేషన్'కాపోతానన్నావు?"

రాజా తను సాయంత్రం చెప్పింది సరిగావినిపించుకోలేదల్లే ఉంది. స్టేషనుకే పోతానని చెప్పానందామనుకుంది. కాని అబద్ధమాడటానికి ఆత్మ వప్పుకోలేదు.

"అవును!... నేను యిందాక అనుకున్నది, అన్నది సినిమాస్కోప్‌కి పోతాననే..."

"మరి"

"కాని స్టేషనుకు పోయాను"

"ఏం?"

ఏంకారణం చెప్పాలి?

"ఆఁ..."హిగ్గిన్‌బాదమ్స్"కు పోయాను 'క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్" కోసం. అబద్ధం ఆడకతప్పలేదు శశికళకి.

"మరి కొనుక్కురాలేదేం? దొరకలేదా!"

"ఆఁ...దొరకవేదు...అయిపోయినయ్‌ట..."

"అవును! "లక్ష్మీప్రసాద్ అండ్‌కో"లోకూడా అయిపోయినవిట. అదేం పుస్తకమో. దానికంత డిమాండెందుకో?...రేపు తెప్పిచ్చి యిస్తానన్నారు. రేపు గుర్తుచేయి."

"అలాగే"

రాజారంగులు తీసికొని గదిలోకి వెళ్ళిపోయాడు. శశికళ శూన్యాకాశంలోకి దీక్షగా రెండు క్షణాలు చూసి రాజాఉన్న గదిలోకే పోయింది.

రాజా అప్పటి కేటేబుల్‌లైట్ వెలిగించి కుంచె చేత్తో పట్టుకొని కూర్చున్నాడు—శశికళకోసమే ఎదురు చూస్తున్నాడా అన్నట్లు. శశికళ రాజాకెదురుగా యింకో కుర్చీలో కూర్చుంది.

రాధ రేడియో ట్యూన్ చేసింది కాబోలు దూరంనుండి పాట వినపడుతున్నది. మృదుమధుర సంగీతంతో కూడిన ఆ పాటను వింటూ, తన బొమ్మను గీస్తున్న అస్నిగ్ధసౌమ్యమూర్తిని చూస్తూ అలా కుర్చీలో శశికళ ఎంతసేపు కూర్చుందో!

---

నిరంతరం పరిగ్రహించడమే కాని పరిత్యజించడం తెలియని మనిషి మురుగునీటికుంట వంటివాడు; అందులోకి ఏ నీరు ప్రవహించినా మలినం అవుతుంది. —జే.ఏ. జేమ్